RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

సంపుటి : 04 సంచిక : 190 రంగారెడ్డి ఎడిటర్ : గంజి వెంకటేశ్ ఆదివారం , జూన్ 7, 2026 పేజీలు : 8 వెల: 3 రూ.

Volume: 04 Issue :190 Rangareddy Editor: Ganji Venkatesh Sunday, June 7, 2026 Pages:8 Price: 3/-



## నగరంలో చల్లబడ్డ వాతావరణం

- పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం

హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

హైదరాబాద్ నగరంలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ నగరవాసులకు భారీ వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడగా, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లో కూడా వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయ్యింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

### వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...

## బ్లూకలర్ జాబ్స్

- పరిస్తితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి
- జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు
- డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్టస్ ఏర్పాటు
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు.
జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు.

03



## అన్నామలైకి భారీ ఫాలోయింగ్

'వుయ్ ద లీడర్స్' ఉద్యమానికి భారీ మద్దతు

ఒక్కరోజులోనే 14 లక్షలమంది ఫాలోవర్లు చేరిక

చెన్నై,జూన్6(పద్మక్రాంతి):

తమిళనాడు రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేసిన 24గంటల్లోనే 14లక్షలకు పైగా ప్రజలు ఆయనతో చేరారు. తాను చేపట్టే 'వుయ్ ద లీడర్స్' ఉద్యమంలో చేరాలని కోరుతూ అన్నామలై ఆన్‌లైన్ లింక్ ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో పెద్దఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రానికి 14లక్షలకు పైగా ప్రజలు అందులో చేరారు. ఇంకా సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. ఇదే పేరుతో ఆయన 2020లోనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి

03


## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఇదే తమ మొదటి డిమాండ్..కొనసాగిస్తాం కూడా
- ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ధర్నా...ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్



న్యూఢిల్లీ,జూన్6(పద్మక్రాంతి):

నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని



సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని

03

## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

- ముందస్తు చర్యలకు సిద్ధం కండి
- ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు
- కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు



హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు,

03

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

- భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు



హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా.. పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు

03




- ఎవరెంత ఏడ్చినా.. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి

### అష్టదరిద్రులు అడ్డంపడ్డా

## అభివృద్ధి ఆగదు

> "నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది."

రంగారెడ్డి,జూన్6(పద్మక్రాంతి):

రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల

03



### సెమీ కండక్టర్ పరిశ్రమల

## ఏర్పాటుకు అనుకూలం

- మలేషియా ప్రతినిధి బృందందతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

03





## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

- తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర
- సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి
- మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,జూన్6(పద్మక్రాంతి):

కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి

03

## గిగ్ వర్కర్లుగా మహిళలు

స్త్రీ రైడ్ ప్రోగ్రామ్ కింద 55మందికి శిక్షణ

'స్త్రీ రైడ్' ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్



03

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### ఆర్థిక మోసాలకు
# అడ్డుకట్ట ఏదీ ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక రకమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్యాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

# ఆదాయం కోసం అడ్డగోలు నిర్ణయాలు

- భూముల విలువలకు తోడు..మద్యం ధరలు
- ఈ నెలలోనే మద్యం ధరలు పెంచే యోచన



**హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):**

రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను పెంచేసింది. ఆదాయం సమకూర్చుకోవడం లక్ష్యంగా ఎట్టకేలకు శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చింది. మరో వారం పదిరోజుల్లో మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఒక్కో బాటిల్‌పై 80 నుంచి వందవరకు పెంచుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం ధరలను పెంచడానికి సిద్ధమైనట్లు సమాచారం. ముడి సరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈమేరకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉంది. భూముల ధరలు పెంచడం, మద్యం ధరలు పెంచడం ద్వారా ఉచిత పథకాలకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. అలాగే భూములను కూడా ఎక్కడికక్కడ తెగనమ్ముతున్నారు. ఇదిలావుంటే ఈసారి భూముల విలువలు పెరుగుతాయనే అనుమానంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు గురువారం వరకు పెద్ద మొత్తంలో స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా, భూముల మార్కెట్ విలువలు రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రాగానే రిజిస్ట్రేషన్లు తక్కువ సంఖ్యలో అయ్యాయి. ప్రతి జిల్లాలో సగటున 50శాతం వరకు భూ విలువలు పెరగ్గా, కమర్షియ ల్ ప్రాంతాల్లో భారీగా పెంచారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు పెద్దగా పెంపు లేదని చెబుతున్నా, ప్రాంతాల వారీగా పెరిగిన మార్కెట్ విలువలను చూస్తుంటే రిజిస్ట్రేషన్ల భారం అధికంగానే ఉంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు అభివృద్ధి, పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న చోట మార్కెట్ విలువలను 50శాతం మేర పెంచారు. గ్రామీణ, పట్టణాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి శాస్త్రీయంగా మార్కెట్ విలువలను సవరించామని అధికారులు చెబుతున్నా, ఆస్తుల క్రయ విక్రయదారులకు భారీగానే భారం మోపారని తెలుస్తోంది. ధరలు పెరుగుతాయని ముందస్తు సమాచారం తోనే పాత ధరలకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూముల విలువలు సవరణతో మార్కెట్ విలువ ప్రకారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు భారం కానున్నాయి. వాస్తవానికి ఏటా కొంత మేరకు మార్కెట్ విలువలను సవరించాల్సిన ప్రభుత్వం ఏకంగా ఒకేసారి పెంచడంతో ఆస్తుల క్రయవిక్రయదారులపై భారం పెరిగింది. ప్రజలపై భారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ ఖజానాను నింపేలా మాత్రమే అధికారులు కసరత్తు చేశారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు గతంలో ఉన్న మార్కెట్ విలువలను రెట్టింపు చేశారని, ఇది శాస్త్రీయంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల విలువను సైతం భారీగా పెంచడంతో ఆస్తుల కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో 100శాతం మేరకు మార్కెట్ విలువలను పెంచారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో, రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్న చోట స్వల్పంగా పెంచినా, పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరేలా మార్కెట్ విలువను పెంపుదల చేశారు. మార్కెట్ విలువలు పెరగడంతో స్టాంపు డ్యూటీ, ఇతర రిజిస్ట్రేషన్ చార్జీల భారం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధికంగానే ఉండనుంది.

# దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

- కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద
- దిగజారుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు
- కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 9న సిపిఎం దేశవ్యాప్త నిరసనలు

**రాజమహేంద్రవరం,జూన్6(పద్మక్రాంతి):**

దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పేపర్ లీకేజీలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులకు వ్యతిరేకంగా జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ సమావేశం శనివారం సిపిఎం కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిధి గా పాల్గొన్న వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదలు మరియు మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుందని, కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి విస్తృత ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు.ప్రజల జీవన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలైన ఉపాధి, విద్య, వైద్యం, ధరల నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 9న నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్ లో యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా 1200 మంది పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్, పి తులసి, జిల్లా కమిటీ సభ్యులు సుందర బాబు, పూర్ణిమ రాజ్, ఎస్ ఎస్ మూర్తి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

### ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం
### హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

**టెహ్రాన్,జూన్6(పద్మక్రాంతి):**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.

హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# సహారా ఎడారిలో మృత్యు ఘోష

- నీళ్లు లేక 49మంది మృత్యువాత

సహారా,జూన్6(పద్మక్రాంతి):పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.

చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

## ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం

- అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు



**చండీఘడ్,జూన్6(పద్మక్రాంతి):**

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు.ప్రతి ఏటా జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘారా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు. దాదాపు 4,000 మంది పోలీసు సిబ్బందిని రక్షణ కార్యక్రమాల్లో భాగం చేశారు. కాగా, భింద్రన్‌వాలేను సిక్కు సమాజంలోని కొంతమంది అమరవీరుడిగా భావిస్తే, మరికొందరు ఆయనను పంజాబ్‌లో తీవ్రవాద ఉద్యమానికి ప్రతీకగా చూస్తారు.

## అన్నామలై బాటలో సుమతి వెంకటేశ్

- బిజెపికి రాజీనామా చేసిన పార్టీ రాష్ట్రకార్యదర్శి

**చెన్నై,జూన్6(పద్మక్రాంతి):**

తమిళనాడు భారతీయ జనతా పార్టీలో సంక్షోభం మరింత ముదురుతోంది. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్ పార్టీని వీడిన కొన్ని రోజుల్లోనే, మరో కీలక నేత పార్టీకి గుడ్‌బై చెప్పారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన భావోద్వేగ లేఖను పంచుకున్నారు. భారమైన హృదయంతో తప్పుకుంటున్నానని.. చాలా రోజులు ఆలోచించిన తర్వాతే తాను ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సుమతి వెంకటేష్ తెలిపారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ, పార్టీతో తన అనుబంధాన్ని ముగిస్తున్నానని ఆమె తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ పార్టీలో పనిచేయడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కూడా సుమతి అన్నారు. అన్నామలై దారిలోనే ఇప్పుడు మిగిలిన కీలక నేతలు కూడా నడుస్తుండటం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు



మొదటి పేజీ తరువాయి ..

మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15

తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేసామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

మొదటి పేజీ తరువాయి ..

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

## సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడు తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ- మలేషియా మధ్య సాంకేతిక, పెట్టుబడి సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. మలేషియా ప్రతినిధి వైబీ జగదీప్ సింగ్ దియో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

## గిగ్ వర్కర్లుగా మహిళలు

హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

గిగ్ వర్కర్లలో ఇప్పుడు మహిళలు కూడా చేరబోతున్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు.

మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళలు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో వీరికి టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 55 మంది మహిళలకు ఈమేరకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. జొమాటో, స్విగ్గీ తరహా డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచాలన్నారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని ఆనంద్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

## అన్నామలైకి భారీ ఫాలోయింగ్

మొదటి పేజీ తరువాయి ..

ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు. వియ్ ది పీపుల్‌ను ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు. తన ఉద్యమానికి వాలంటీర్లే జీవనాడి అని అన్నారు. కొత్త తరం నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, క్షేత్రస్థాయిలో అసలైన మార్పు కోసం వాలంటీర్లు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని వాలంటీర్లు ఎంచుకుని చేతనైన మేరకు తాముంటున్న చోట మేలి మార్పులు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజులు మరింత మెరుగ్గా ఉండేలా తాను చేస్తున్న ప్రయత్నాలను చేయూతను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

మొదటి పేజీ తరువాయి ..



వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

## వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం...

# బ్లూకలర్ జాబ్స్

మొదటి పేజీ తరువాయి ..

వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్ట్‌లతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళు కూడా చెరువులను అక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు ధైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు. ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్పోర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది. ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రోపాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు

గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ పాలనలో

# పాలమూరుకు ద్రోహం

మొదటి పేజీ తరువాయి ..

పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి తట్టెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

### ప్రజల సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### – క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి

మంచిర్యాల జిల్లా/రామకృష్ణాపూర్ జూన్ 6 (పద్మక్రాంతి):






రామకృష్ణాపూర్ పట్టణం కేతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11,13వ వార్డుల్లో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభ కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ గొడిశెల సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేకూరాలని అధికారులను సూచించారు. అదేవిధంగా వార్డుల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ పనుల పూర్తి విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి వినతిని పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్,పట్టణ ఎస్సై జె .శ్రీధర్, 11వ వార్డు కౌన్సిలర్ బొమ్మ భూమా గౌడ్, 13వ వార్డు కౌన్సిలర్ జక్కనబోయిన మంజుల కుమార్,సంబంధిత శాఖల అధికారులు,వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు భూమేష్ కి

## బిర్సా జాతీయ ఉపాధ్యాయ అవార్డు 2026

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ జూన్ 6 (పద్మ క్రాంతి):





మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని అబ్రహం నగర్ లో నివాసం ఉంటున్న బండారి భూమేష్ అను భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు జిల్లా కేంద్రంలోని హాజీపూర్ మండలం ఘడ్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయనకు గురువారం చత్తీస్గడ్ రాష్ట్రం చంపారన్ లో శిక్ష సాగర్ ఫౌండేషన్ వారు నిర్వహించిన బిర్సా ముండా జాతీయ ఉపాధ్యాయ అవార్డు 2026 పురస్కారం అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమేష్ చేసినటువంటి వివిధ సామాజిక కార్యక్రమాలు ఆయా సబ్జెక్టుల్లో చేసిన విశేష కృషికి అవార్డు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయండి : ముప్పు శ్రీనివాస్ రెడ్డి

పద్మక్రాంతి, జూన్ 6, కీసర :



ఉప్పల్ బాగాయత్ లో నేడు సాయంత్రం 5 గంటలకు మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన శంకుస్థాపన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేయుచున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి నాగారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం సెరినిటీ స్కూల్ వద్ద బస్సులు ఏర్పాటు చేస్తున్నామని నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సుదర్శన్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు




పద్మక్రాంతి, జూన్ 6, కీసర :

మేడ్చల్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. నాగారం మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నాయకులు కౌకుంట్ల రాహుల్ రెడ్డి ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొని, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వామన్, రాకేష్, అస్లాం, ఉపేందర్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలి

### - బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రమీల



మేడిపల్లి, జూన్ 06 (పద్మక్రాంతి):

ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోతే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రమీల ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కొరకు సంక్షేమశీ కొరకు బడ్జెట్లో 2500 కోట్ల రూపాయల ప్రత్యేక నిధి కేటాయించాలని అలాగే బీసీ సబ్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరి బీసీ సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి నిధుల వినియోగానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని పేద విద్యార్థులకు విద్య దూరం కాకుండా ఉండేందుకు పెండింగ్ ఫీజు బకాయిలను ఇవ్వాలని, బీసీల ఆర్థిక , విద్య,,రాజకీయం సాధికారతకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని, బీసీ యువతకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పనకు ప్రత్యేక విధానాలు రూపొందించాలని కోరారు

పాల్గొన్నారు. ప్రేయర్ ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి రచ్చ కిషన్, సైదమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య తోనే భవిష్యత్తు : జిల్లా ఎస్పీ



- నాయకత్వ లక్షణాలు పెంపొందాలి

పాపన్నపేట, జూన్ 6 (పద్మక్రాంతి)



విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పాపన్నపేట లోని ఓ ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ,ఉమెన్ సేఫ్టీ వింగ్,మై ఛాయిస్ ఫౌండేషన్,యంగిస్థాన్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాలపంచాయతీ (చిల్డ్రన్ పార్లమెంట్ ) కార్యక్రమం నిర్వహించారు. పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.విద్య,బాల్య వివాహాలు,బాల్య కార్మిక వ్యవస్థ నిర్మూలన,పారిశుద్ధ్యం,త్రాగునీరు బాలల రక్షణ అంశాల పై అధికారులతో చర్చించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని అధికారులకు జిల్లా ఎస్పీ,అదనపు కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,డిఎస్పీ ప్రసన్నకుమార్,తహశీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,సీఐ లు జార్జి,రాజశేఖర్,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,ఎంఈవో ప్రతాప రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,డీసీపిఓ నాగరాజు,యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి వృత్తిక,సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు.





- భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి.
- ఘనంగా కొనసాగుతున్న థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్.

హైదరాబాద్ జూన్ 6 (పద్మక్రాంతి ప్రతినిధి):

పోచంపల్లి చేనేత కళకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లోహా ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ నుహా మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్లోని హైటెక్స్ జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి : గుత్తా.**

మాదాపూర్ హైటెక్స్ లో "పోచంపల్లి త్రెడ్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శిచి , వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లిహాశాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు. చేనేత వస్త్రాలను ధరించి , మన సాంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శిచి, నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, లో సంబధిత అధికారులు పాల్గొన్నారు.

### చిందం మహేందర్ పటేల్ కు

# శుభాకాంక్షల వెల్లువ



పద్మక్రాంతి, జూన్ 6, కీసర :

తెలంగాణ రాష్ట్రం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు. సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ పటేల్, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులు పర్వతం సతీష్ పటేల్, మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పటేల్, జనరల్ సెక్రటరీ చాట్లపల్లి నర్సింగరావు పటేల్, ఆకుల సత్యనారాయణ పటేల్, పీర్జాదిగూడ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ పటేల్, ఉప్పు రవీందర్ పటేల్, మట్టి బాలరాజు పటేల్, మల్యాల రమేష్ పటేల్, చెంది శ్రీనివాస్ పటేల్, తరుణ్ పటేల్, అయ్యగారి రాజలింగం పటేల్, పొనగంటి శేఖర్ పటేల్ తదితరులు చిందం మహేందర్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### భారతీయ షెడ్యూల్డ్ కులాలకు మత స్వేచ్ఛ

# సత్యమా? స్వప్నమా??




పద్మక్రాంతి, జూన్ 6,(కూకట్పల్లి, ప్రతినిధి )

ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న 1950 లో ఇచ్చిన షెడ్యూల్ కులాల ఆర్డర్ ను వెంటనే రద్దు చేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. నేడు కూకట్ పల్లి 9వ ఫేజ్ లోని పి ఏసు పాదం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించగా దీనికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ అడిషనల్ డీజీ బాబురావు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన 76 ఏళ్ల అన్యాయం భారతీయ షెడ్యూల్ కులాలకు మత స్వేచ్ఛ సత్యమా, స్వప్నమా అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తెలిపిన విధంగా మతం మారితే కులం మారదని చెప్పిన మాటలను గుర్తు చేస్తూ దళిత కులాలకు సమాన హక్కులు కల్పిస్తూ మతాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు బండి సంజయ్ కిషన్ రెడ్డి ఇద్దరు రాష్ట్రపతి ఉత్తర్వుల పైన మంత్రివర్గంలో చర్చించి రద్దు చేసే దిశగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం దీనిని గుర్తు పెట్టుకొని రాహుల్ గాంధీ చొరవతో ఈ విషయంపై పార్లమెంట్లో చర్చ పెట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దళితుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోకపోతే దళితులందరూ భారతదేశ వ్యాప్తంగా ఏకమై పెద్ద ఉద్యమానికి తెరలేపుతామని హెచ్చరించారు.

## అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

### – తహసీల్దార్ మతిన్



పద్మక్రాంతి, జూన్ 6, జవహర్ నగర్ :

ప్రభుత్వ భూముల రక్షణ ధ్యేయంగా పనిచేస్తామని, జవహర్ నగర్ లోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామని కాప్రా తహసీల్దార్ మతిన్ హెచ్చరించారు. కాప్రా తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ ఐ సత్యనారాయణ శనివారం వికలాంగుల కాలనీ, మోహన్ రావు కాలనీ, సంతోష్ నగర్, డెంటల్ కాలేజీ సమీపంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను జెసిబి సహాయంతో నీలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రజా అవసరాలకు కేటాయించిన భూములను కాపాడుతామని, పేద ప్రజలు ప్రభుత్వ భూములు కొని మోసపోవద్దని హెచ్చరించారు.

## చిట్కుల్ విలేజ్‌కు మహర్దశ.. ప్రగతి ప్రణాళికతో ముందడుగు దిశ!

- వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయం మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్
- వార్డు కార్యాలయంలో 99 రోజుల ప్రణాళికపై ప్రత్యేక సమావేశం

పటాన్ చేరు, జూన్ 6, (పద్మక్రాంతి):

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ వార్డు కార్యాలయం వేదికగా శనివారం '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'పై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మోటే సుమలత శ్రీకాంత్ హాజరై, ప్రగతి పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... రాబోయే 99 రోజుల్లో వార్డు పరిధిలోని సమస్యలన్నింటినీ రూపుమాపి, ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో ఎలాంటి అలసత్వ వహించినా సహించేది లేదని హెచ్చరించారు.

### సమస్యల సత్వర పరిష్కారం

వార్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### వేగవంతంగా అభివృద్ధి పనులు

మంజూరైన ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత కాలపరిమితిలోగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

### పారిశుధ్యానికి పెద్దపీట

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వార్డులో పారిశుధ్య లోపం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.



ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను ఒక బాధ్యతగా స్వీకరించి పరిష్కరించాలి. స్థానిక కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి అని మోటే సుమలత శ్రీకాంత్, తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను, ప్రజల అభ్యర్థనలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా వార్డు అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.



RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# సింగరేణిలో 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

- సగటున 50 లక్షల టన్నులు ఉండాల్సింది
- కొన్ని ప్రాజెక్టుల్లో పనులు ఆగిపోవడంతో తగ్గిన ఉత్పత్తి
- సింగరేణి సంస్థ వివరణ

హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రస్తుతం బొగ్గు నిల్వలు, టెండర్ విధానాలు, ఆరోపణలపై వివరణ ఇచ్చింది. ప్రస-్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే అందుబాటులో ఉందని సంస్థ తెలిపింది. గత 10 సంవత్సరాల్లో ఇదే అత్యల్ప స్థాయి స్టాక్‌గా నమోదు అయినట్లు స్పష్టం చేసింది. 2014-2024 మధ్య సగటు బొగ్గు నిల్వలు స-ుమారు 50 లక్షల టన్నులుగా ఉన్నాయని, అయితే ప్రస్తుత తగ్గుదల అసాధారణం కాదని.. ఇది సాధారణ ఉత్పత్తి, రవాణా పక్రియలో భాగమేనని సంస్థ తెలిపింది. వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ అవసరాల కోసం కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు అవసరమని కూడా వివరించింది. ఓవర్ బర్డెన్ పనులకు టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసినట్లు సింగరేణి స్పష్టం చేసింది. సైట్‌ను ప్రత్యక్షంగా పరిశీలించకుండా కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేయడం, మధ్యలో నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. శ్రీరాంపూర్ -2 సహా కొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో ఆగిపోవడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని వివరించింది. ఈ కారణంగా మే 2025 నుంచి సైట్ విజిట్ సర్టిఫికేట్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. మెడికల్ బోర్డు నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై



అవినీతి నిరోధక శాఖ విచారణ కొనసాగుతోందని సంస్థ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు అరెస్టులు జరిగినట్లు, సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. అలాగే విజిలెన్స్ విభాగం కూడా అంతర్గత విచారణను కొనసాగిస్తున్నట్లు సింగరేణి యా-జమాన్యం పేర్కొంది. మొత్తం వ్యవహారంపై పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకుంటున్నామని సంస్థ స్పష్టం చేసింది.

# పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న ట్రక్కులు
- 8మంది ప్రయాణికుల దుర్మరణం



చండీగఢ్,జూన్6(పద్మక్రాంతి):


పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమి డేరాకు శనివారం ఉదయం ప్రయాణం మొదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పో-యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్‌లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల మృతితో ప్రమాద స్థలం, ఆస్పత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు.

# మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

- సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి
- జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు
- టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు

అమరావతి,జూన్6(పద్మక్రాంతి):





మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశినిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.
డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసం-మని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉ ంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభి్ర-పాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే
బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళు తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

# ఇసుక అక్రమ రవాణ్యా నిరోధానికి చర్యలు

- అధికారును ఆదేశించిన మంత్రి వివేక్



హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై మంత్రి వివేక్ వెంకటస్వామి సీరియస్ అయ్యారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిఘా వ్యవస్థ బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లారీల కదలికలపై నిరంతరం పర్యవేక్షించాలని హుకుం జారీ చేశారు.
ఇసుక ఆదాయం పెంపుపై టీజీఎండీసీ అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇసుక నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని దిశానిర్దేశర చేశారు. అలాగే, సాండ్ బజార్ల పనితీరుపై మంత్రి వివేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కీలక ఖనిజాల అన్వేషణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖనిజ వనరుల సమర్థ నిర్వహణకు అమలు వ్యవస్థ పటిష్ఠం చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్ నియంత్రణ చర్యలను మంత్రికి.. టీజీఎండీసీ అధికారులు వివరించారు. రాష్ట్ర ఖనిజ రంగంలో ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాలు

- ఎస్‌ఓటి పోలీసుల మెరుపు దాడి




హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

శంషాబాద్ మండలంలోని బురుజుగడ్డ తండాలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కోడిపందాల స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు ఒక్కసారిగా మె-రుపు దాడి చేశారు. బుర్జుగడ్డ తండా శివారు ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా, రహస్యంగా ఈ కోడిపందాలను నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు, పందాల స్థావరాన్ని చుట్టుముట్టి అక్రమంగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని రట్టు చేశారు. ఈ దాడిలో కోడిపందాలు కాస్తూ, జూదానికి పాల్పడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను పోలీసులు సంఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఘటనాస్థలం నుంచి భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పందాల కోసం సిద్ధం చేసిన రూ. 3,82,000 నగదుతో పాటు, పందాలకు ఉపయోగిస్తున్న కోళ్లను మరియు నిందితులు అక్కడికి చేరుకోవడానికి ఉపయోగించిన వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అయితే, ఈ కోడిపందాల నిర్వహణను వెనకుండి నడిపిస్తూ, అంతా తానై పర్యవేక్షిస్తున్న ప్రధాన నిర్వాహకుడు మాత్రం పోలీసులు రాకను గమనించి అక్కడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్నాడు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఆ ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సాగే ఇలాంటి అక్రమ జూద కార్యకలాపాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టబోమని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.

# వరి కొయ్యలను కాల్చే రైతులపై చర్యలు

## 8 మంది రైతులకు 5 వేల చొప్పున జరిమానా

జగిత్యాల,జూన్6(పద్మక్రాంతి):

వరి కొయ్యలను కాల్చే రైతులపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పంట పొలాలలో వరి కొయ్యలు కాల్చిన 8 మంది రైతులకు 5 వేల రూపాయల చొప్పున జరిమానా విధించింది. కథలాపూర్ మండలం రాజారామ్ తండాలో వరి కొయ్యలకు రైతులు నిప్పంటించారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ పంచాయతీ సమక్షంలో రైతులకు జరిమానా విధించారు.
గతంలో వరి కొయ్యలను కాల్చరాదని గ్రామ పంచాయతీలో గ్రామస్తులు తీర్మానం చేశారు. పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి నేల సారాన్ని కాపాడాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ విజ్ఞప్తి చేశా-రు. భవిష్యత్తులో వరి కొయ్యలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని రైతులను హెచ్చరించారు. వరి కొయ్యలు కాల్చడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీవో 27 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం నిబంధనలను ఉల్లంఘించిన వారికి పర్యావరణ పరిహారం పేరిట భారీ జరిమానాలు విధిస్తారు. బహిరంగంగా పంట వ్యర్థాలను తగలబెట్టే తీవ్రతను బట్టి రూ. 5 వేల నుంచి రూ. 25 వేల వరకు జరిమానాలు విధించి ఆయా గ్రామ పంచాయతీలు జరిమానాలు వసూలు చేసా-యి. ఈ విషయాలను వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తున్నా వరి కొయ్యలను రైతులు కాలుస్తూ ప్రమాదాలు కారణమవుతున్నారు. జగిత్యాల జిల్లాలో రైతులు పంట అవశేషాలను, వరి కొయ్యలను కాల్చవద్దని, అలా చేస్తేవారికి జరిమానా విధిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. వరి కొయ్యల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమిలోని సేంద్రియ కార్బన్, వానపాములు నశించి భూసారం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్, మామిడి తోటలకు వ్యాపించి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట అవశేషాలను తగలబెడితే రూ. 5,000 నుంచి రూ. 25,000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# ఎన్టీపిసి ఫ్లై యాష్‌తో కాలుష్యం

## నివారణ చర్యలపై అధికారులతో పవన్ సమీక్ష

విజయవాడ,జూన్6(పద్మక్రాంతి):

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వెలువడుతున్న ఫ్లై యాష్ (బూడిద) కాలుష్య సమస్య ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి చేరింది. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, జనసేన నాయకుడు అక్కల గాంధీ ఈ సమస్యను పవన్ కల్యాణ్‌కు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూలపాడు గ్రామానికి వచ్చిన పవన్ కల్యాణ్‌ను స్థానిక నాయకులు కలిసి ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న యాష్ కారణంగా పరిసర గ్రామాల్లో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పవన్ కల్యాణ్ సుమారు అరగంట పాటు స్థానిక నాయకులు, సంబంధిత వర్గాలతో చర్చించారు. బూడిద కాలుష్యం వల్ల రైతులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడే ్ర÷÷-ల యాష్ కారణంగా చెట్లు, పంటలు, పశువులు ప్రభావితమవుతున్నాయని, గ్రామాల్లో గాలి కాలుష్యం పెరుగుతోందని స్థానికులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఉ ప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ జెన్కో అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచిస్తామని తెలిపారు.

# సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):



మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించ బోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉ పాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

# ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

- మహిళ మృతి..బాలుడికి తీవ్ర గాయాలు

హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):

ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోకముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న 13 నెలల మనవడు జియోల్ గాయపడటంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటన అనంతరం అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

# రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

- ఇప్పుడేమో హడావిడి చేస్తే ఎలా నమ్మాలి
- సిఎం తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్,జూన్6(పద్మక్రాంతి):**

రెండున్నరేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టటెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందని అన్నారు. ఇప్పుడు అకస్మా?త్తుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లపాటు పాలమూరు-రంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వలేనే సోయి లేదని అన్నారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.

# నార్సింగ్ స్టేషన్‌కు బొల్లా బ్రహ్మనాయుడు

**కాంచీపురం నుంచి తరలించిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):**

గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వైసిపి నేతలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంచీపురం నుంచి రోడ్డు మార్గం గుండా నార్సింగికి పోలీసులు తీసుకొస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన తర్వాత బ్రహ్మనాయుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. భూకబ్జా కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాహ్మనాయుడి అరెస్ట్‌తో ఆ సంఖ్య ఆరుకు చేరింది. మాజీ ఎమ్మెల్యేను నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో పీఎస్ వద్దకు పెద్ద సంఖ్యలో వినుకొండ వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. శుక్రవారమే బ్రహ్మనాయుడిని కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు.. అక్కడ స్థానికంగా ఉన్న కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం నార్సింగి పీఎస్‌కు తరలించారు. గండిపేటలోని సర్వేనెంబర్ 18లో సుమారు వంద ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా కాజేసేందుకు నిమ్మల కుటుంబసభ్యులు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, నకిలీ పత్రాలను సృష్టించడంలో మధ్యవర్తి రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో బయటపడింది. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఐదు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు విషయం తెలిసిన వెంటనే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. ఆయనపై సైబరాబాద్ పోలీసులు నిఘా ఉంచారు. కొంతకాలం బెంగళూరులో ఉన్న బ్రహ్మనాయుడు అక్కడి నుంచి కేరళకు వెళ్లి ఆపై తమిళనాడులోని కాంచీపురంకు వెళ్లారు. బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసుల బృందం, ఈవోడబ్ల్యూకు సంబంధించిన మరో బృందం అక్కడకు చేరుకుని మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

# కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

- ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం

**కరీంనగర్,జూన్6(పద్మక్రాంతి):**

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# పక్షుల సంరక్షణపై బర్డ్ వాక్

- పోచారం డిబిసిలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభం



**మెదక్,జూన్6(పద్మక్రాంతి):**

ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం పోచారంలోని డీబీసీలో నిర్వహించిన బర్డ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పోచారం ల్యాండ్‌స్కేప్‌లో గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం ఉందని దీనిని కాపాడేందుకు బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబీస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని కోరారు. పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రను వివరించాలని సూచించారు. పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని, నీటి వనరులను కాపాడాలని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి , మెదక్ డీపీఆర్వో రామచంద్ర రాజు, ఎఫ్ఆర్వోలు , బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యం





- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో వార్డు సభల నిర్వహణ
- నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర

**నల్లగొండ,జూన్6(పద్మక్రాంతి):**

ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యమవుతుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం రెండో విడతగా పలు వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. జల్ సంచయ్- జల్ భాగీధారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని పిలుపునిచ్చారు.

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపడుతున్న డ్రైనేజీల పూడికతీత పనులు, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత చర్యల గురించి ప్రజలకు వివరించారు. డ్రైనేజీలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. నగరంలో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ నిర్వహణ, పారిశుధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పచ్చదనం పెంపు ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమల వ్యాప్తిని నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తాగునీటిని శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. వార్డు సభలలో ప్రజల నుండి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు, రహదారులు, వర్షపు నీటి పారుదల, పార్కుల అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, ఇతర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, సూచనలు స్వీకరించారు. అందిన ప్రజా ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నగర ప్రజలు చురుకుగా పాల్గొనాలని, రాబోయే విడతల వార్డు సభలకు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు మందడి లిఖిత సైదిరెడ్డి, దొడ్డి రమేశ్, గోపరాజు స్వాతి రాజశేఖర్, మొహమ్మద్ ఇబ్రహీం, రఫియోద్దీన్, వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులకు బుద్ధి

- సొంతింటిని వృద్ధులకు అప్పగించిన అధికారులు

**మిర్యాలగూడ,జూన్6(పద్మక్రాంతి):**



వృద్ధ తల్లిదండ్రులను దూరం కొట్టిన కొడుకులకు కలెక్టర్ గట్టి బుద్ధి చెప్పారు. వారి ఇంటిని వారికి స్వాధీనం చేయించారు. వివరాల్లోకి వెళితే..నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇంజం చంద్రకళ భర్త రమణారెడ్డి(70) వయోవృద్ధులు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉంది. వారి విద్యాభ్యాసం, పెళ్లిళ్ల వంటి బాధ్యతలు అన్ని నిర్వర్తించడం జరిగింది. వీరికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఇంజంవారిగూడెంలో వ్యవసాయ భూమి, మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ ఇళ్లు కలదు. వీరి పేరు మీద ఉన్నటువంటి ఇంటిలో కుమారుడు గత ఐదేండ్లుగా నివాసం ఉంటూ తల్లిదండ్రులను రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పక్షవాతం, మోకాళ్ల ఆపరేషన్, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వయోవృద్ధులు ఆర్డీఓ ట్రిబ్యునల్ అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్, సీనియర్ సిటిజెన్స్ చట్టాన్ని ఆశ్రయించడంతో వయోవృద్ధుల చట్టం 2007ను అనుసరించి జిల్లా కలెక్టర్ గత నెల 15వ తేదీన సదరు ఆస్తిని వారికి స్వాధీనపరచాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు పరచాల్సిందిగా ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి వివిధ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో జరపాలని గత 23వ తేదీ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉత్తర్వుల అమలులో భాగంగా మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, స్థానిక సీఐ నాగభూషణం, తాసీల్దార్ సిబ్బంది, రెవెన్యూ, మహిళా శిశు, దివ్యాంగుల వయో వృద్ధుల శాఖ అందరు కలిసి ఆ వయో వృద్ధులను శనివారం వారి ఇంటిలోకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ నుండి రాజు, ఆర్ఐ, సిడిపిఓ కార్యాలయం నుండి రాములు గారు నాగిరెడ్డి నవీన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలతో జాగ్రత్త
- జిల్లాల కలెక్టర్లకు సిఎస్ దిశానిర్దేశం

**హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):**



జూన్ 21వ తేదీన జరగనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 208 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 నగరాల్లో 72,956 మంది విద్యార్థులు నీట్‌కు హాజరు కానున్నారని చెప్పుకొచ్చారు. పరీక్షా కేంద్రాల్లో భద్రత, విద్యుత్, తాగునీరు, రవాణా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు దిశానిర్దేశర చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల రవాణాకు తొలిసారిగా భారత వైమానిక దళం సేవలు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఈ పరీక్షల భద్రతకు ఈసారి ప్రత్యేక భద్రతా ప్రోటోకాల్స్ అమలు చేస్తున్నామని సీఎస్ రామకృష్ణారావు పేర్కొన్నారు.

# భువనగిరి మార్కెట్‌లో జంక్షన్ బాక్సుల ధ్వంసం

- విలువైన వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లిన దొంగలు

**భువనగిరి,జూన్6 (పద్మక్రాంతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ మార్కెట్ ప్రాంగణంలోకి ప్రవేశించి విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన జంక్షన్ బాక్స్‌లను ధ్వంసం చేసి సుమారు రూ.25 లక్షల విలువ గల విద్యుత్ వైర్లను శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా వ్యవస్థలో భాగంగా ఉన్న జంక్షన్ బాక్స్‌లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ముందుగా విద్యుత్ కనెక్షన్లను ధ్వంసం చేసి, విద్యుత్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది జంక్షన్ బాక్స్‌లు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయంతో పాటు ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం సంభవించిందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు చోరీ కావడం స్థానికంగా సంచలనం రేపింది. మార్కెట్ వంటి కీలక ప్రభుత్వ ప్రాంగణంలో భద్రతా లోపాలు ఎలా చోటు చేసుకున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై మార్కెట్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నేరంలో పాల్గొన్న వారిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి ప్రధాన కేంద్రాల్లో రాత్రి వేళల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# డిప్యూటీ కమిషనర్ రామలింగం కు శుభాకాంక్షలు

**పద్మక్రాంతి, జూన్ 6, కీసర :**



కీసర సర్కిల్ నూతన డిప్యూటీ డిప్యూటీ కమిషనర్ గా రామలింగం ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ నాలుగవ వార్డ్ మాజీ కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ కమిషనర్ రామలింగం ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పనిచేస్తామని నూతన కమిషనర్ రామలింగం తెలిపినట్టు మంగళపూరి వెంకటేష్ తెలిపారు.

# హోటల్ స్లాబ్ కూలి నలుగురికి గాయాలు

**వికారాబాద్,జూన్6(పద్మక్రాంతి):**

వికారాబాద్ జిల్లా మర్పల్లిలో శనివారం మధ్యాహ్నం ఓ హోటల్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది.ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జేసీబీ సాయంతో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాలకింద ఇంకెవరైనా ఉన్నారా అని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆరా తీస్తున్నారు.

# గండిపేట భూకబ్జా కేసు

- వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు

**హైదరాబాద్,జూన్6(పద్మక్రాంతి):**



గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్ విధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినాలి.. ఎందుకో తెలుసా..?



రోజూ ఉదయం మనం అనేక రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను తింటుంటాం. ఇడ్లీ, దోశ, పూరీ ఇలా వెరైటీ టిఫిన్లను తింటాం. అయితే బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు పలు ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది. దీంతో మనం అధికంగా ప్రయోజనాలను పొందవచ్చు. రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఆరోగ్యవంతమైన ఆహారాలను తింటే పోషణ లభించడమే కాదు, శరీరానికి శక్తి అందుతుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉంటారు. అలాగే రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇక ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో కలిపి తినాల్సిన ఆరోగ్యవంతమైన ఆహారాల్లో మొలకెత్తిన పెసలు కూడా ఒకటి. వీటినే మొలకలు అని కూడా అంటారు. వీటిని ఉదయం తింటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.


**పోషకాలు..:** రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. ఈ పెసలను తింటే వృక్ష సంబంధమైన ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి, మరమ్మత్తులకు ఎంతగానో దోహదపడతాయి. ఉదయం మొలకలను తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉండవచ్చు. ఉత్తేజంగా పనిచేస్తారు. బద్దకం లేకుండా ఉంటుంది. ఎంత పనిచేసినా అలసిపోరు. పెసలను తినడం వల్ల పలు ఎంజైమ్‌లు మన శరీరంలో ఉత్పత్తి అవుతాయి. ఇవి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. దీంతో మన శరీరం పోషకాలను సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. రోజూ సుఖ విరేచనం కలుగుతుంది. పెసలను తింటే అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి కూడా బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది.

**విటమిన్ సి..:** పెసలలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు. రోగాలు రాకుండా ఉంటాయి. పెసలలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. పెసలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు నియంత్రణలో ఉండాలనుకునే వారు పెసలను ఆహారంలో భాగం చేసుకోవాలి. పెసలను రోజూ తినడం వల్ల బరువు తగ్గుతారు. అలాగే శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి.

**కొలెస్ట్రాల్ స్థాయిలు..:** పెసలలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. పెసలలో ఉండే పొటాషియం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. దీంతో రక్త సరఫరా నియంత్రణలోకి వస్తుంది. బీపీ తగ్గుతుంది. హృదయ సంబంధ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మొలకెత్తిన పెసల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి ఇవి బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. వీటిని తింటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. మధుమేహం ఉన్నవారు రోజూ మొలకలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయవచ్చు. మొలకలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. ఇలా పెసలను మొలకెత్తించి తింటే అనేక లాభాలను పొందవచ్చు.


## మీ కండరాలు బలంగా ఉన్నాయా..

# అయితే మధుమేహం ముప్పు తప్పినట్టే!



న్యూఢిల్లీ: కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు 44 శాతం తగ్గుతుందని వెల్లడైంది. యూకే బయోబ్యాంక్ నుంచి 1.4 లక్షల మంది సమాచారాన్ని విశ్లేషించి హాంకాంగ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు ఈ విషయం తేల్చారు. మధుమేహం ముప్పు అధికంగా ఉన్నవారి కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు వృద్ధి చెందే అవకాశాలు తగ్గుతాయని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక బయోమెడ్ సెంట్రల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హాంకాంగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యంగ్వన్ కిమ్ మాట్లాడుతూ, వారానికి రెండు రోజులు, 150-300 నిమిషాలపాటు కండరాల పటిష్టత కోసం కృషి చేయాలని తెలిపారు. కండరాల పటిష్టత ఓవరాల్ ఫిట్‌నెస్‌కు ముఖ్యమని చెప్పారు. నడి వయసు నుంచి వృద్ధాప్యం వరకు టైప్-2 మధుమేహం ముప్పును ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలో తేలిందని ఆయన చెప్పారు.

# అరిగిన కీళ్లకు కణాలతో వైద్యం





**మోకాళ్ల నొప్పులు వృద్ధాప్య సమస్యల్లో ఒకటిగా చెప్పుకొనేవారు. అదంతా ఒకప్పుడు. ఇప్పుడు నలభై ఏళ్లకే మోకాళ్లే కాదు ఇతర కీళ్లలోనూ నొప్పులతో తిప్పలు పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స చేయకపోతే శస్త్ర చికిత్స చేయాల్సిందే. ప్రారంభంలోనే పీఆర్‌పీ థెరపీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కీళ్ల నొప్పులకు కారణాలు ఏమిటి? నొప్పికి ముందే వాటిని ఎలా గుర్తించాలి? ఆపరేషన్ లేకుండానే పీఆర్‌పీ థెరపీతో ఎలా నివారించవచ్చో నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

కీళ్ల నొప్పులు వయసుతో సంబంధం ఉన్న వ్యాధుల్లో ఒకటిగా వైద్యులు గుర్తించారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులతో కీళ్ల నొప్పులకూ వయోసడలింపు వచ్చేసింది. అరవైకి ఇరవై ఏళ్ల ముందే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్నవారు నానాటికీ పెరుగుతున్నారు. మోకీళ్లే కాదు భుజం నొప్పి, వెన్ను నొప్పి, తుంటి నొప్పి%‍% ఇలా శరీరంలోని కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కీళ్ల నొప్పులకు జీవన శైలి, ఆహారమే కాదు నిర్లక్ష్యమూ ఓ కారణమే.

మోకాలి నొప్పులు: కొందరిలో మోకాలి కీలులోని కార్టిలేజ్ అరుగుతుంది. దీని వల్ల కీళ్లలోని ఎముకల మధ్య రాపిడి జరుగుతుంది. అప్పుడు కీలులో నొప్పి కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఈ నొప్పి వల్ల రోగి లేవడం, నడవడం కష్టంగా ఉంటుంది. వయసు రీత్యా వచ్చే ఈ సమస్యను ప్రారంభదశలోనే గుర్తించి, పీఆర్‌పీ థెరపీ చేస్తే.. సర్జరీ అవసరమే ఉండదు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే, రోగం ముదిరిన తర్వాత చికిత్స చేయాలంటే శస్త్ర చికిత్స ద్వారా కీలు మార్పిడి చేయడమే పరిష్కారం.

భుజం నొప్పి: భుజాల్లోని టెండాన్ (ఎముకను అతుక్కుని ఉండే కండరాల అంచు)కు పగుళ్లు రావడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. అంటే ఎముకను అతుక్కునే కండరం చివరి భాగం దెబ్బతిని, ఎర్రగా మారుతుంది. అందువల్ల భుజంలో నొప్పి కలుగుతుంది. చేతిని అటూ, ఇటూ, పైకి, కిందికి కదిలించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే చేయి కదిలించడం కష్టం. చేతిని కదల్చలేని 'ఫ్రోజన్ షోల్డర్' అంటారు. ఈ సమస్యను సకాలంలో గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే సర్జరీ తప్పదు.

ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్: కరోనా చికిత్సలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్యతో బాధపడే రోగుల సంఖ్య కోవిడ్ తర్వాత పెరిగింది. స్టెరాయిడ్స్ వాడితే తుంటిలోని కీళ్లలో రక్త ప్రసరణ తగ్గుతుంది. తుంటిలోని ఎముక కుళ్లుతుంది. నొప్పి తీవ్రంగా బాధిస్తుంది. తుంటిని కదిలించలేరు. ఈ సమస్య చిన్న వయసులో వస్తే వారికి పీఆర్‌పీ చికిత్స ఉత్తమమైన పద్ధతి.

టెన్నిస్ ఎల్బో సమస్య: మోచేతిలోని ఒక చిన్న ఎముకతో ఐదు కండరాలు అనుసంధానమవుతాయి. ఈ కండరాలను 'కామన్ ఎక్స్‌టెన్షన్ టెండాన్' అంటారు. ఆటలు ఆడినప్పుడు, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఆ కండరాలు ఎముకతో అనుసంధానమైన చోట పగుళ్లు ఏర్పడతాయి. అందువల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆటలు ఆడలేరు. అలాంటి వారికి శస్త్ర చికిత్స అందుబాటులో లేదు. వారికి పీఆర్‌పీ థెరపీతో ఉపశమనం ఉంటుంది.


అరికాళ్లలో నొప్పి: అరికాళ్లలో నొప్పి (మడమ నొప్పి)ని 'ప్లాంటార్ ఫేషి ఐటీస్' అంటారు. ఎక్కువగా నడవడం వల్ల, చెప్పులు లేకుండా పనిచేయడం వల్ల, గరుకు ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడటం వల్ల మడమలో ప్లాంటర్ పొర తెగుతుంది. అప్పుడు మడమ (అరికా ళ్ల)లో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. నడవడం కష్టమవుతుంది. ఈ సమస్యకు కూడా సర్జరీ లేదు. పీఆర్‌పీ థెరపీ చక్కటి పరిష్కారం.

ప్రారంభ దశలో..: కొంతమంది 30 నుంచి 40 ఏళ్ళ మధ్య వయసులో జాయింట్ పెయిన్స్ వస్తే.. అవగాహన లేక పట్టించుకోరు. ఉపశమనం కోసం ఆయింట్‌మెంట్లు రాసుకుంటారు. నూనెలతో మర్దనా చేసుకుంటారు. కొంతమంది నొప్పుల మాత్రలు వాడతారు. ఇవి వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది. కొన్నిరోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకొందరు కొన్ని ప్రత్యేక వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చని ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాయామాలతో కీళ్ల నొప్పులు తగ్గకపోవడమే కాకుండా తీవ్రమవుతాయి. అందుకని తరచూ నొప్పులు వచ్చినా లేక దీర్ఘకాలంగా నొప్పులు బాధిస్తున్నా వైద్యులను సంప్రదించాలి. ఎక్స్‌రే లేదా స్కానింగ్ తీయించుకోవాలి. ఇబ్బందిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో ఆదిలోనే సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు.

కీళ్ల సమస్యల లక్షణాలు: కీళ్లలో తీవ్రమైన నొప్పి రావడం, 15 రోజుల పాటులేదా తరచూనొప్పి ఉంటే కీళ్లలో డ్యామేజ్ ఉందేమోనని అనుమానించాలి. కీళ్లను కదిలించలేకపోవడం, కీళ్లలో వాపు.

మణికట్టు, భుజం, చీలమండ, భుజంలో తీవ్రమైన నొప్పి పీఆర్‌పీ థెరపీ ఎలా చేస్తారు?: 'ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా' థెరపీని 'పీఆర్‌పీ థెరపీ' అంటారు. ఇది పాత చికిత్సా పద్ధతే! కొన్ని కారణాల వల్ల ఈ పద్ధతి ప్రాచుర్యంలో లేదు. ఐదారేళ్ల నుంచి ఈ చికిత్సా విధానానికి ఆదరణ పెరుగుతున్నది. ఈ థెరపీ గురించి అనేక పరిశోధనలు జరిగాయి. మెరుగైన ఫలితాలు గుర్తించడంతో దీనికి మళ్లీ డిమాండ్ పెరిగింది. ఈ పీఆర్‌పీ చికిత్సా పద్ధతిలో రోగి నుంచి 20 మిల్లీ లీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఆ రక్తాన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో నింపిన తర్వాత పీఆర్‌పీ సెంట్రిఫ్యూజ్ మెషిన్‌లో తిప్పుతారు. రక్తం నుంచి 'గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్' వేరవుతాయి. ఈ సెల్స్‌ను దెబ్బతిన్న కీలు భాగంలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. కార్టిలేజ్ దెబ్బతిన్న భాగంలోకి గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్'ని పంపడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. కార్టిలేజ్ రీ మోడలింగ్ (పునరుత్పత్తి) జరుగుతుంది. ఈ విధంగా సమస్య తీవ్రతను బట్టి రెండు లేదా మూడు సార్లు పీఆర్‌పీ థెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది. థెరపీ అనంతరం మూడు నుంచి నాలుగు నెలలపాటు వైద్యుల పరిశీలన (ఫాలో అప్) అవసరం. థెరపీ అనంతరం కొన్ని జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించాలి. వైద్యులు సూచించిన వ్యాయామాలు చేయాలి. క్రీడల్లో గాయపడ్డ వారికి కూడా పీఆర్‌పీ థెరపీ మంచి ఫలితాలు ఇస్తుంది.

# రోజూ పచ్చి కొబ్బరిని తినడం అలవాటు చేసుకోండి..



పూజలు లేదా ఇతర శుభ కార్యాలు జరిగినప్పుడు హిందువులు కొబ్బరికాయలను కొడుతుంటారు. ఆ తరువాత వాటిని నైవేద్యంగా పెట్టి తమ కోరికలను నెరవేర్చమని కోరుకుంటారు. అలాగే చాలా మంది ఇలాంటి కార్యక్రమాలకు కొబ్బరికాయలను ఉపయోగించకపోయినా తరచూ వంటల్లో మాత్రం కొబ్బరిని వేస్తుంటారు. కొందరు పచ్చి కొబ్బరిని వంటల్లో వేస్తే కొందరు ఎండు కొబ్బరిని వేస్తారు. కొబ్బరి వేస్తే వంటలకు మంచి రుచి, వాసన వస్తాయి. అయితే ఆరోగ్యపరంగా కొబ్బరి మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. కొబ్బరిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

జీర్ణ సమస్యలకు..: జీర్ణ సమస్యలతో బాధపడేవారికి కొబ్బరి ఔషధంగా పనిచేస్తుంది. రోజూ ఒక చిన్న పచ్చి కొబ్బరి ముక్కను కాస్త బెల్లంతో కలిపి రాత్రి పూట భోజనం చేసిన అనంతరం తింటుండాలి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. మలబద్దకం తగ్గుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. రోజూ కొబ్బరిని తినలేకపోతే రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను సేవించవచ్చు. ఇది కూడా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

వేడి తగ్గేందుకు..: విరేచనాలు అయినప్పుడు కొబ్బరిని తింటే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కొబ్బరిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పచ్చి కొబ్బరిలో ఇది కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేలా చూస్తుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. పచ్చి కొబ్బరిని వేసవిలో తింటే శరీరం చల్లగా ఉంటుంది. శరీరంలోని వేడి పోతుంది. కొబ్బరి మన శరీరానికి చలువ చేస్తుంది. కాబట్టి పచ్చి కొబ్బరిని వేసవిలో తినాలి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

మూత్రాశయ సమస్యలకు..: వేసవిలో చెమట కాయలు అధికంగా అవుతుంటాయి. అలాగే కొందరికి విపరీతంగా చెమట వచ్చి శరీరం దుర్వాసనగా ఉంటుంది. అలాంటి వారు కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. లేదా కొబ్బరి నీళ్లను కాస్త నీటిలో వేసి కలిపి ఆ నీటితో స్నానం చేస్తున్నా సమస్యలు తగ్గుతాయి. పొట్టలో నులి పురుగుల సమస్య ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. జీర్ణాశయం శుభ్రంగా ఉంటుంది. మూత్రాశయ సమస్యలు ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటున్నా లేదా కొబ్బరి నీళ్లను తాగుతున్నా ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ పంగల్, యాంటీ వైరల్ గుణాలు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు కారణం అయ్యే క్రిములను నిర్మూలిస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. అలాగే కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కిడ్నీ స్టోన్స్ కరిగిపోతాయి. ఇలా కొబ్బరిని రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

# వంకాయలను తేలిగ్గా తీసుకుంటే ఎన్నో లాభాలను కోల్పోతారు..!




వంకాయలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇందులో అనేక రకాలు ఉంటాయి. పర్పుల్, తెలుపు,గ్రీన్ కలర్‌లలో వంకాయలు మనకు అందుబాటులో ఉన్నాయి. వంకాయలతో ఏ కూర చేసినా సరే ఎంతో రుచిగా ఉంటుంది. వంకాయలతో పచ్చడి, టమాటా కూర, వేపుడు ఎక్కువగా చేస్తుంటారు. వంకాయల్లో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల వంకాయలను తినడం వల్ల సుమారుగా 17.8 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి. ప్రోటీన్లు 8 గ్రాములు, శాచురేటెడ్ కొవ్వులు 5.2 గ్రాములు, ఫైబర్ 4.9 గ్రాములు, కొవ్వు 27.5 గ్రాములు, కొలెస్ట్రాల్ 16 మిల్లీగ్రాములు, చక్కెరలు 11.4 గ్రాములు, ఐరన్ 6 మిల్లీగ్రాములు లభిస్తాయి.

విటమిన్ ఎ అధికం..: వంకాయలను తింటే విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. అలాగే క్యాల్షియం, సోడియం, పొటాషియం కూడా అధిక మొత్తంలో పొందవచ్చు. ప్లీహం వాపులకు గురైన వారు వంకాయలను తింటే ఎంతో ఫలితం ఉంటుంది. పచ్చి వంకాయ పేస్టుకి చక్కెర కలిపి ఉదయం తినాలి. దీంతో కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. వంకాయ, టమాటా కలిపి తింటే అజీర్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. వంకాయను తినడం వల్ల గ్యాస్, అసిడిటీ, కఫం వంటి సమస్యలు తగ్గుతాయి. వంకాయను ఉడకబెట్టి తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం కాస్త తింటే నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది.

సూప్ కూడా తాగవచ్చు..: వంకాయ సూప్‌ను కూడా తయారు చేసి తీసుకోవచ్చు. ఇందులో ఇంగువ, వెల్లుల్లి వేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. ఈ సూప్‌ను తాగితే కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారు వంకాయలను తింటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. వంకాయల్లో ఉండే ఫైబర్ షుగర్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. కొన్ని ఆఫ్రికా దేశాల వారు వంకాయలను ఫిట్స్ తగ్గించేందుకు వాడుతారు. వంకాయల నుంచి రసం తీసి తయారు చేసిన ఆయింట్ మెంట్లు, టించర్లు పైల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. వంకాయలను పేదవారి ప్రోటీన్ ఫుడ్‌గా చెప్పవచ్చు. వంకాయలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాకుండా కండరాల నిర్మాణానికి దోహదం చేస్తాయి.

వీరు తినకూడదు..: అల్సర్ సమస్య ఉన్నవారు వంకాయలను తినకూడదు. గర్భిణీలు వంకాయలను తినడం మంచిది కాదు. తింటే అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కొందరికి వంకాయ పడదు. దీన్ని తిన్న వెంటనేఅలర్జీలు వచ్చి శరీరందురద పెట్టే అవకాశంఉంది. చర్మ వ్యాధులు ఉన్నవారు కూడా వంకాయలకు దూరంగా ఉండాలి. వంకాయలను తినడం వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలుకలిగే మాటవాస్తవమే అయిన ప్పటికీ ఆయా సమస్యలు ఉన్నవారు మాత్రం వీటికి దూరంగా ఉండాలి. అలాగే ఆపరేషన్ చేయించుకోబోతున్న వారు, చేయించుకున్నవారు కూడా వంకాయలను తినకూడదు. గుండె జబ్బులు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే వంకాయలను తినాలి. వంకాయలను అతిగా తింటే వాతం చేస్తుంది. కాబట్టి వీటిని మోతాదులోనే తినాలి.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక




# రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు

## హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్

రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు.

రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500 కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు, అందుకే తన సినిమాకు హైప్ తీసుకొచ్చేందుకే ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.







# పెద్ది సినిమాలో ముద్దు సన్నివేశం

## జాన్వీ పాత్రపై నెటిజన్ల విమర్శలు
## ప్రేక్షకుల మనోభావాలు గౌరవిస్తామన్న బుచ్చిబాబు

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్ పాత్రకు ప్రశంసలు దక్కినప్పటికీ జాన్వీకపూర్ రోల్‌పై మాత్రం విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇందులోని ఓ ముద్దు సన్నివేశం నెట్టింట వైరల్‌గా మారింది. ఏ సందర్భం లేకుండా ఉద్దేశపూర్వకంగా దాన్ని పెట్టారంటూ నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఆమెను గ్లామర్ వరకే పరిమితం చేశారని పోస్ట్లు పెడుతున్నారు. దీనిపై తాజాగా దర్శకుడు బుచ్చిబాబు స్పందించారు. ఆ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి ఇంత ప్రతికూల స్పందన వస్తుందని తాను ఊహించలేదని బుచ్చిబాబు పేర్కొన్నారు. రామ్ చరణ్, జాన్వీకపూర్ మధ్య ఒక ఆహ్లాదకరమైన, సరదాగా సాగే ప్రేమకథను చూపించాలనేదే తమ ఉద్దేశమని ఆయన వివరించారు. ప్రేక్షకులకు కలిగిన అసంతృప్తిని దృష్టిలోఉంచుకుని, రాబోయే రోజుల్లో పాత్రలను, సన్నివేశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉంటామని అన్నారు. ఇకపై అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చేవిధంగా ప్రెజెంట్ చేస్తామని ఆయన తెలిపారు. మహిళలంటే తనకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉందని దర్శకుడు బుచ్చిబాబు తెలిపారు. హీరోయిన్ పాత్రను చూపించిన విధానంతో పాటు కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సెలబ్రిటీలు సైతం వీటిని తప్పుపడుతూ పోస్ట్లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు వివరణ ఇచ్చారు. క్షమాపణలు కోరుతూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

'ఒక దర్శకుడిగా.. సినిమాతో ప్రేక్షకులను అలరించాలి, వారిలో స్ఫూర్తి నింపాలని, వారితో మమేకం కావాలని నేను అనుకుంటాను. ఎవరినీ అసౌకర్యానికి గురిచేయాలని, అగౌరవపరచాలని చూడను. 'పెద్ది'లోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు మా దృష్టికి వచ్చాయి. వాటిని తీవ్రంగా పరిగణించాం. తెరపైన, తెర వెనుక కూడా మహిళలంటే నాకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉంది. మహిళల పాత్రలను అగౌరవపరచడం నా ఉద్దేశం కాదు. ఈ సినిమాలో సన్నివేశాలు మీ మనోభావాలు దెబ్బతీసేలా ఉంటే.. మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను' అని బుచ్చిబాబు తన పోస్ట్‌లో రాశారు. ఇక విమర్శలు వస్తోన్న నేపథ్యంలో ఆయా సన్నివేశాల్లో మార్పులు చేస్తున్నట్లు బుచ్చిబాబు తెలిపారు.

# 200 కోట్ల క్లబ్‌కు చేరువగా పెద్ది

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా విడుదలైన తొలి షో నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పుడు కలెక్షన్ల పరంగా కూడా తన సత్తా చాటుతోంది. వర్కింగ్ డేస్‌లో విడుదలైనప్పటికీ 'పెద్ది' సాధిస్తున్న వసూళ్లు ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. మొదటి రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన ఈ సినిమా, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించడం విశేషంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైన 'పెద్ది' మొదటి రోజే రూ.130 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి రామ్ చరణ్ కెరీర్‌లోనే అతిపెద్ద ఓపెనింగ్స్‌లో ఒకటిగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, ఓవర్సీస్ మార్కెట్లలో కూడా సినిమాకు మంచి ఆదరణ లభించింది. ప్రత్యేకంగా నార్త్ అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో 'పెద్ది' ప్రీమియర్ షోలు మరియు తొలి రోజు వసూళ్లు అద్భుతంగా నమోదయ్యాయి. దీంతో సినిమా మొదటి రోజే బ్లాక్‌బస్టర్ దిశగా అడుగులు వేసింది. సాధారణంగా భారీ సినిమాలకు మొదటి రోజు తర్వాత వసూళ్లు కొంత తగ్గడం సహజం. అయితే 'పెద్ది' విషయంలో అలాంటి పరిస్థితి కనిపించలేదు. రెండో రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా మరో రూ.50 కోట్ల గ్రాస్‌ను ఈ చిత్రం రాబట్టినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీంతో కేవలం రెండు రోజుల్లోనే సినిమా మొత్తం రూ.181.8 కోట్ల గ్రాస్ వసూళ్లను అందుకుని మరో అరుదైన మైలురాయిని చేరుకుంది.






# కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక

కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

# విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి

## నటి అనసూయా భరద్వాజ్

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు.



# పెద్దికి ఊహించని విజయం

'మేం నమ్మిన విషయాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. స్ఫూర్తిదాయకమైన 'పెద్ది' సినిమాని తమ పిల్లలతో కలిసి కుటుంబాలు ఆస్వాదిస్తున్నాయి. రానున్న పది రోజుల్లో 'పెద్ది' మరింత పెద్ద విజయంగా నిలుస్తుంది' అన్నారు బుచ్చిబాబు సానా. ఆయన దర్శకత్వంలో... రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'పెద్ది'. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పించాయి. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా బాక్సాఫీస్ ఛాంపియన్ పేరుతో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ 'చాలా పెద్ద విజయం ఇది. ముందస్తు ప్రదర్శనల నుంచే నా ఫోన్ ఆగకుండా మోగుతోంది. నా తొలి చిత్రం 'ఉప్పెన' కంటే పది రెట్లు మించిన స్పందన వచ్చింది. సినిమా చూసినవాళ్లంతా ఎంతో స్ఫూర్తి పొందామని చెబుతున్నారు. రామ్‌చరణ్ పడిన కష్టాన్ని అందరూ గుర్తించారు. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ఆదరణతో అద్భుతంగా దూసుకుపోతోంది 'పెద్ది' చిత్రం. తొలి రోజే రూ.135 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యుత్తమైన సినిమాగా నిలుస్తూ, రికార్డ్ స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది. నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ చూడని ఓ కొత్త రకమైన క్రీడా నేపథ్యంలోని సినిమా ఇది. పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే చిత్రం. అందుకే ఇంటిల్లిపాదీ వెళ్లి చూడాలని కోరుతున్నాం. దర్శకుడు బుచ్చిబాబు రాసిన కథ, అద్భుతమైన రామ్‌చరణ్ నటన కారణంగా ఈ సినిమా రికార్డు స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది' అన్నారు.

Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.